క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలతోనే ఉన్నత స్థాయి
– మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్



సమస్యలు తెలుసుకుంటున్న శంకర్

నారాయణఖేడ్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఖేడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. సదుపాయాలు, సమస్యలను గురించి లైబ్రేరియన్ లలితను, పాఠకులను అడిగి ససమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయంలో ఇదివరకే రెండు ఏసీలను ఏర్పాటు చేయించామని, త్వరలో మరిన్ని పుస్తకాలను కూడా తెప్పిస్తామన్నారు. ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్టుతో యువజన సంఘాల నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అండూర్ గ్రామంలో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నేటితో ముగిసింది. ఆదివారం క్రికెట్ ఫైనల్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో గడ్డపోతారం జట్టు మొదటి స్థానంలో నిలవగా, అండూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక నాయకులు, యువజన సంఘాల నాయకులు బహుమతులను అందించారు.

ఫ్లాగ్ మార్చ్‌తో భరోసా
– డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

జహీరాబాద్ టౌన్: ఎటువంటి అభద్రతకు గురికాకుండా నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకొనే భరోసా ఇవ్వడానికే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని డీఎస్పీ కె.రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు మొగుడంపల్లి, చిరాగ్‌పల్లి, సత్వార్, ఖాసీంపూర్ తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎక్కడైనా సమస్యాత్మక ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జహీరాబాద్ టౌన్ సీఐ రాజబోయిన రవి, రూరల్ సీఐ నహిమొద్దీన్, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్, టౌన్ ఎస్‌ఐ లక్ష్మారెడ్డి, కోహీర్ ఎస్‌ఐ కృష్ణగౌడ్ పాల్గొన్నారు.


ఘనంగా బీరప్ప జాతర



స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మనూరు మండలంలోని తుమ్నూర్ గ్రామంలో ఆదివారం బీరప్ప స్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. మ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొని గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, కాంగ్రెస్ నాయకులు బ్రహ్మానందరెడ్డి, దిగంబర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గొల్ల బాషన్న, మనోహర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో సనాతన ధర్మం భాగం కావాలి
– జన జాగరణ మంచ్ బాధ్యుడు రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

జహీరాబాద్ టౌన్: మానవ జీవితంలో సనాతన ధర్మం భాగమవ్వాలని జన జాగరణ మంచ్ తెలంగాణ రాష్ట్ర బాధ్యుడు నల్లా చక్రవర్తుల రామకృష్ణ పిలుపునిచ్చారు. బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో శ్రీరామ మందిరంలో 'సనాతన ధర్మం– మన కర్తవ్యం' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. వక్తగా ఆయన మాట్లాడుతూ హిందూ మతంలో చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్‌కుమార్ దేశ్‌పాండే, శంకర్‌రావు కుల్‌కర్ణి, సురేశ్ కుల్‌కర్ణి, బాబురావు జోషి తదితరులు పాల్గొన్నారు.

'ఆమె'దే ఆధిక్యం..

- జహీరాబాద్ స్థానంలో పెరిగిన ఓటర్లు
- అత్యధిక శాతం మహిళలదే..
- మొత్తం ఓటర్ల సంఖ్య 16,40,755
- 7నియోజకవర్గాలు.. 1973 పోలింగ్ కేంద్రాలు





ఓటు వేసేందుకు క్యూలో వేచిఉన్న మహిళలు(ఫైల్)

జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో మహిళలే కీలకపాత్ర పోషించనున్నారు. ఇటీవల విడుదల చేసిన ఓటరు జాబితాలో మహిళా ఓటర్లే అధిక్యంలో ఉన్నట్లు తేలింది. ఈ ఎంపీ ఎన్నికలలో అభ్యర్థుల గెలుపు, ఓటముల నిర్ణయం మహిళల చేతుల్లోనే ఉన్నట్టు. దీంతో ప్రధాన పార్టీల నేతలు వాళ్లను దృష్టిలో పెట్టుకుని ముమ్మర ప్రచారానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

సంగారెడ్డి టౌన్: త్వరలో జరగనునన్న లోక్‌సభ ఎన్నికలకు అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ సమయాన్ని ఉదయం 7నుంచి సాయంత్రం 6వరకు పెంచారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రచార రథాలతో ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఇప్పటికే పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. మూడు ప్రధాన పార్టీలతో పాటు మరో 16మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పార్టీలకు చెందిన వారు ముగ్గురు బరిలోఉండగా, రిజిస్టర్ రాజకీయ పార్టీలకు చెందిన వారు ఆరుగురు, మిగతా పది మంది స్వతంత్ర అభ్యర్థులు ఉండడంతో ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండు ఈవీఎం మిషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ఈవీఎంలో నోటాతో కలిపి 16గుర్తులు ఉంటాయి. ఓటర్లు ఈవీఎంలను పరిశీలించి నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చు. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో 1973పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పెరిగిన ఓటర్లు..

పార్లమెంట్ స్థానంలో 2019లో జరిగిన ఎన్నికలకు 14,94,843మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇప్పుడు 16,40,755 మంది ఓటర్లు నమోదయ్యారు. మొత్తంమీద ఈ ఎన్నికలకు 1,45,912మంది ఓటర్లు పెరిగారు. అందులో మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్నారు.

7అసెంబ్లీ స్థానాలు..

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అందులో కామారెడ్డి జిల్లాలోని జుక్కల్(ఎస్సీ), బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోల్ (ఎస్సీ), జహీరాబాద్(ఎస్సీ) అసెంబ్లీ స్థానాలు.

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఇతరులు	మొత్తం
కామారెడ్డి	1,32,301	1,22,306	19	2,54,626
నారాయణఖేడ్	1,18,373	1,18,859	9	2,37,241
జుక్కల్(ఎస్సీ)	1,03,286	99,474	9	2,02,769
బాన్సువాడ	1,02,990	93,688	13	1,96,691
ఎల్లారెడ్డి	1,16,131	1,06,876	2	2,23,009
అందోల్(ఎస్సీ)	1,28,186	1,22,666	5	2,50857
జహీరాబాద్(ఎస్సీ)	1,37,866	1,37,694)	2	2,75,562
జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో..	8,39,133	8,01,563	59	16,40,755

కంకర తేలి.. నరకంగా మారి..



ధ్వంసమైన రహదారి

- ధ్వంసమైన పైప్‌లైన్ రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని పైప్ లైన్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డుపై పలు చోట్ల కంకర తేలి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ఇబ్బందిగా మారిందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. నలభై ఏళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై ప్రయాణం నరకప్రాయంగా మారింది. కోతలాపూర్, మక్తాల్లూర్, కలివేముల, చెర్లగూడెం, జుల్ కల్, ఎద్దుమైలారం తదితర గ్రామాల ప్రజలకు ఇదే ప్రధానమైన రహదారి. ఆయా గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. కంకర తేలడంతో అధికారులు పలుమార్లు మొరం వేసినా అది మూణ్నాళ్ల ముచ్చగానే ఉంది. కొన్నాళ్లకే తిరిగి గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట ప్రయాణం మరింత నరకప్రాయంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన పైప్ లైన్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు.

ఉజ్జీవ సభల పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: అల్లీపూర్ గార్డెన్ నగర్‌లో 17నుంచి ప్రారంభంకానున్న మెథోడిస్ట్ 94వ క్రైస్తవ ఉజ్జీవ సభల పోస్టర్‌ను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ, సరీన్‌జాన్, రవికుమార్ ఆదివారం మాట్లాడుతూ సభల జాతర 17న ప్రారంభమై 19వరకు కొనసాగుతుందన్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్, హెఆర్‌సీ ప్రెసిడెంట్ డానియల్, సెక్రటరీ దయానంద్, హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కంది(సంగారెడ్డి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1988–1990లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమై ఉత్సాహంగా గడిపారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

బైక్‌చోరీలపై పోలీసుల విచారణ

ఏడు బైక్‌లు స్వాధీనం

వట్‌పల్లి(అందోల్): ఆంధ్ర నుంచి అక్సానపల్లికి బైకులను అక్రమంగా తరలించి తక్కువ ధరకు అమ్ముతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి ఏడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. బాబా అనే వ్యక్తికి బంధువైన ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తి విజయవాడ నుంచి బైకులు తీసుకువచ్చి రూ.10వేల నుంచి రూ.20వేలకు విక్రయించి వెళుతున్నట్లు పోలీసుల విచారణలో బయట పడింది. దీంతో జోగిపేట పోలీసులు గ్రామానికి చేరుకొని విజయవాడ నుంచి అక్రమంగా తీసుకువచ్చి విక్రయించిన ఏడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. వారికి సహకరిస్తున్న వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నామని ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారంలో డిజైర్ సొసైటీలో ఆదివారం రెండో రోజు సమ్మర్ క్యాంపు నిర్వహించారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. బాలకృష్ణ, నాగార్జున, రజనీకాంత్ హీరోల నటనతో కళాకారులు విద్యార్థులను అలరించారు. పోటీల్లో గెలపొందిన వారికి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పూలే, అంబేడ్కర్ సేవాసమితి కార్యదర్శిగా వినోద్

నారాయణఖేడ్: అంబేడ్కర్, పూలే సేవాసమితి ఖేడ్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా జి.వినోద్ కుమార్ నియామకమయ్యారు. ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడు బైండ్ల కృష్ణ నియామక ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం, ప్రధాన కార్యదర్శి పండరి, ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ సమస్యల పరిష్కారానికి కృషి



సంగారెడ్డి టౌన్: నీలం మధును సత్కరించిన చర్చి ఫాదర్ యేసుపాల్ తదితరులు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

సంగారెడ్డి టౌన్: క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు అన్నారు. ఆదివారం సౌందర్య సీయోనుచర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ యేసుపాల్ మధుతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం చర్చి ఫాదర్, నిర్వాహకులు మధును శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ప్రచారం..

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్ నేతలు ప్రతాప్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో నీలం మధుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సురేష్ షెట్కార్ విజయం తథ్యం

కల్హేర్(నారాయణఖేడ్)/నారాయణఖేడ్: ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని మాజీ ప్రణాళిక సంఘం సభ్యుడు నగేశ్ షెట్కార్, డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట మండలం దామర్‌చెరువు, ఖానాపూర్(బి), బాచేపల్లి, మునిగేపల్లి, పోశెట్టిపల్లి, నాగధర్‌లో సురేశ్‌షెట్కార్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పోచయ్య, శంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేశం, ఎంపీటీసీ మన్నే కృష్ణ, మాజీ సర్పంచ్ గోపాల్, వెంకటేశంసేట్, దేవదాస్ పాల్గొన్నారు. అనంతరం నారాయణఖేడ్‌లో సురేష్ షెట్కార్ తరపున నిర్వహించిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పద్మశాలీల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నర్సింహులు, సంగయ్య, అనంతం, శ్రీనివాస్, ప్రకాశ్, మల్లన్న, గుండు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల ప్రచారం..

జహీరాబాద్/జహీరాబాద్ టౌన్: సురేశ్ షెట్కార్ గెలుపు కోసం ఆయన కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహించారు. శ్రీరామ్ మహెలాలో షెట్కార్ భార్య ఉమ, కుమార్తె గిరిజ, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీత పాటిల్, సంగీత శెట్కార్, కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి శెట్కార్‌ను భారీ మెజార్టీతో తెలిపించాలని కోరారు. మెథడిస్ట్ చర్చి బాగారెడ్డిపల్లి చర్చి, గడి చర్చి, సెంట్రల్ చర్చి, పులిలొంక చర్చి, లాస్ట్‌డేస్ మినిస్ట్రీస్ చర్చిలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.అశోక్, సుజన్ పాటిల్, రాజు, చిన్న, వంశి, నవీన్‌కుమార్, ప్రమోద్, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణఖేడ్: పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మనూరు మండలం తిమ్మాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ నర్సింహులు ముదిరాజ్, నాయకులు సంజీవరావు, శ్రీను, సాయిలు తదితరులు కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

న్యాల్‌కల్(జహీరాబాద్)/కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు విలాస్‌రెడ్డి బీజేపీలో చేరారు. ఆదివారం ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేశానన్నారు. పాండురంగారెడ్డి, ఉమాకాంత్ పాటిల్, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిర్గాపూర్ జెడ్పీటీసీ ఎం.రాఘవరెడ్డి కూడా బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. కడ్పల్ మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, భూంరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కిష్టారెడ్డి తదితరులు పార్టీలో చేరారు. బిడెకన్నే హన్మంత్, అరుణ్‌రాజ్ శెరికార్ పాల్గొన్నారు.

ప్రచారం విస్తృతం చేయాలి..

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు అన్నారు. శనివారం రాత్రి డివిజన్ అధ్యక్షుడు నాగసాని నరేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో బూత్‌లెవెల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని పార్టీ అభ్యర్థి రఘునందన్ రావును భారీ మెజార్టీతో గెలిపించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.



న్యాల్‌కల్(జహీరాబాద్): విలాస్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీబీ పాటిల్

ఇంటింటి ప్రచారం..

రాయికోడ్(అందోల్): కర్చల్ గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా నాయకుడు రవికుమార్, మండల అధ్యక్షుడు నాగరాజ్, నాయకులు గంప సుధాకర్ తదితరులు ఇంటింటికీ తిరిగి బీబీ పాటిల్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎం.మల్లేశ్, జి.సాయి, రాయిపల్లి, ఇందూర్, మామిడిపల్లి, బొగ్గులంపల్లి, నాగన్‌పల్లి బూత్‌స్థాయి నాయకులు పాల్గొన్నారు.

యువత చూపు బీజేపీ వైపు

కొండాపూర్(సంగారెడ్డి)/జహీరాబాద్: దేశంలోని యువత అంతా బీజేపీ వైపే చూస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అనంతసాగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఆకుల సాయికుమార్, రాజేందర్ రెడ్డి, గొల్ల సత్యమ్మ, మల్లేశం ప్రవీణ్ గౌడ్, వెంకట్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జహీరాబాద్‌లోని హమాలీ కాలనీలో నిర్వహించిన ప్రచారంలో శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ భండారి, శ్రీనివాస్‌గుప్తా, విశ్వనాథ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

తీవ్రగాయాలతో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్ : ఆర్టీసీ బస్సును బైకు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. నారాయణఖేడ్ మండలం, మధువర్ గ్రామానికి చెందిన మల్లేశం(30) బతుకుదెరువు కోసం వచ్చి రామచంద్రాపురం మండలం వెలమెల గ్రామంలో ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పటాన్‌చెరు వైపు నుంచి బైక్‌పై మల్లేశం వెలమెల గ్రామానికి వెళ్తున్నాడు. ఘనపూర్ వేములకుంట ఎక్స్ రోడ్డు వద్ద ఎదురుగా కొల్లూరు వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు.


స్కూటీని ఢీకొట్టిన లారీ..

లారీ స్కూటీని ఢీ కొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... హనుమకొండ జిల్లా హనుమాన్ నగర్ కు చెందిన అభినవ్(21) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ ఫార్మా కంపెనీలో పని చేస్తూ చిట్కుల్‌లోని శ్రీరామ హాస్టల్‌లో ఉంటున్నాడు. శనివారం రాత్రి అభినవ్ స్నేహితుడి స్కూటీ తీసుకొని హాస్టల్ నుంచి కర్రీ పాయింట్‌కు వెళ్తున్నాడు. ఇదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి సంగారెడ్డి వైపు లారీ వెళ్తుంది. ఇస్నాపూర్ గ్రామ శివారులో యూటర్న్ చేసే క్రమంలో రాంగ్ రూట్‌లో లారీ స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో అభినవ్ రెండు కాళ్లు విరిగిపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

పెన్షనర్లకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ పార్టీ ముందుంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీత రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేశ్, పరమేశ్ యాదవ్ పాల్గొన్నారు.



రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

అబద్ధాల కాంగ్రెస్..

పటాన్‌చెరు: అబద్దాల కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఏఆర్ బృందావన్ కాలనీ, బృందావన్ టీచర్స్ కాలనీలలో ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైపు ప్రజల చూపు

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీని నమ్మితే మొదటికే మోసం వచ్చిందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఆరోపించారు. శాంతినగర్ కాలనీ పరిధిలోని 8, 9వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి..

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ అన్నారు. ఊట్ల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేశ్, ఆంజనేయులు, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.